క్లుప్తంగా

పార్వతీ పరమేశ్వర అలంకారంలో నిర్మమహేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో నిర్మమహేశ్వరస్వామి

పొదిలి రూరల్: దక్షిణ కాశీగా పేరుగాంచిన పొదిలి పట్టణంలోని పురాతన శివాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి అంకురార్పణతో ఉత్సవాలను ప్రారంభించారు. బుధవారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు పార్వతీ పరమేశ్వర అలంకారంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని పెదసంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయదాతలు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు.

ఆటోల్లో డ్రైవర్ పక్క సీట్ల తొలగింపు



ఆటోలో పక్క సీటు తొలగింపజేస్తున్న రూరల్ ఎస్సై అంకమరావు

మార్కాపురం: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రూరల్ ఎస్సై అంకమరావు తన సిబ్బందితో కలిసి బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆటోల్లో డ్రైవర్ సీటు పక్కనే ఉన్న అదనపు సీట్లను తొలగించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటోలకు జరిమానా విధించి కౌన్సెలింగ్ ఇచ్చారు. 4 రోజుల క్రితం మార్కాపురం మండలం నికరంపల్లి–కుంట మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళా కూలీలు మృతి చెందిన నేపథ్యంలో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు.

ఓపెన్ డ్రింకింగ్‌పై స్పెషల్ డ్రైవ్

పట్టణ శివార్లలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న పలువురిని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు గుర్తించి కేసులు నమోదు చేశారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న పలువురికి జరిమానా విధించారు.


కేవీ రమణారెడ్డిని సన్మానించిన చుండూరు రవిబాబు



కేవీ రమణారెడ్డిని సన్మానిస్తున్న చుండూరు రవిబాబు

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కేవీ రమణారెడ్డిని బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

టెన్షన్ వద్దు సుమా..



- పక్కా ప్రణాళికతోనే పరీక్షలో విజయం 'పది'లం
- మరో 25 రోజుల్లో పదో తరగతి పరీక్షలు
- గడువు సమీపిస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన
- భయం వీడి చదవాలని ఉపాధ్యాయుల సూచన

మార్కాపురం: పదో తరగతి విద్యార్థి బంగారు భవితకు పునాది. పబ్లిక్ పరీక్షలు అనగానే అటు తల్లిదండ్రులు.. ఇటు విద్యార్థులు ఒకింత ఆందోళనకు గురవడం సహజం. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించింది. పరీక్షలకు ఇక 25 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో భయం.. ఒత్తిడి.. ఆందోళనను అధిగమించి మంచి మార్కులు సాధించాలని సబ్జెక్టు నిపుణులు సూచిస్తున్నారు. సిలబస్‌ను ప్రణాళికాబద్ధంగా రివిజన్ చేసుకుంటూ, కొన్ని టిప్స్ పాటించడం ద్వారా పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని చెబుతున్నారు.

మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో టెన్త్ విద్యార్థుల వివరాలు

మండలం	విద్యార్థులు
మార్కాపురం	2,220
తర్లుపాడు	360
పొదిలి	950
కొనకనమిట్ల	640
అర్ధవీడు	440
బేస్తవారపేట	510
కంభం	1,240
గిద్దలూరు	1,310
కొమరోలు	500
రాచర్ల	440
మొత్తం	8610



పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

టెన్షన్ వీడితే హ్యాపీగా రాయొచ్చు



పదో తరగతి విద్యార్థులు తొలుత ఆందోళనను పక్కనబెట్టాలి. చక్కటి ప్రణాళిక, ప్రిపరేషన్ ఉండాలి. ప్రశాంతంగా ఉంటేనే ప్రశ్న చూసిన వెంటనే సమాధానాలు గుర్తుకు వస్తాయి. ప్రశ్నాపత్రాన్ని బాగా అర్థం చేసుకోవాలి. ఓఎంఆర్ షీట్ జాగ్రత్తగా చూసుకోవాలి. అడిగిన ప్రశ్నకు కచ్చితమైన సమాధానం రాయాలి. చక్కటి ప్రెజెంటేషన్ అవసరం. సైన్సు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ బాయ్స్ హెచ్‌ఎం, మార్కాపురం

ఆలోచించి లెక్కలు చేయాలి



గణితం అంటే విద్యార్థులు భయం వీడాలి. ముందుగా ప్రశ్నలు అర్థం చేసుకోవాలి. నూటికి నూరు మార్కులు వచ్చే ఏకైక సబ్జెక్టు ఇదే. పాజిటివ్‌గా ఆలోచించాలి. 8 మార్కుల ప్రశ్నలపై దృష్టిపెట్టాలి. గ్రాఫ్ ఈజీగా ఉంటుంది ఆన్సర్ చేయాలి. స్టాటిస్టిక్స్, ట్రిగనామెట్రీ వాల్యూస్, రూట్ 2, రూట్3, రూట్ 4 లాంటి వాటిని బాగా చదవాలి.

– వి.ఆంజనేయులు, మ్యాథ్స్ టీచర్, జెడ్పీ బాయ్స్ మార్కాపురం

ఫిజిక్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



ఫిజిక్స్ అంటే భయం వద్దు. క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే టాపర్స్ కావచ్చు. 2 గంటల టైం మాత్రమే ఉంటుంది. 50 మార్కులకు ఆన్సర్ చేయాలి. 8 మార్కుల ప్రశ్నలు 3, 4 మార్కుల ప్రశ్నల్లో 3 ప్రశ్నలకు ఆన్సర్ చేయాలి. ఇంకా 1, 2 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. లైట్ రిఫ్లెక్షన్, కెమికల్ రియాక్షన్స్, ఈక్వేషన్స్, ద హ్యూమన్ కలర్ వరల్డ్, ఎలక్ట్రిసిటీ అంశాలను ప్రత్యేకంగా చదువుకోవాలి.

– ఎ.శివకృష్ణ, ఫిజిక్స్ టీచర్, జెడ్పీ బాయ్స్ స్కూల్, మార్కాపురం

హిందీపై భయం వీడాలి



సీబీఎస్ఈ టెక్స్ట్ బుక్స్ చదవాలి. భాషా కీ బాత్, వ్యాకరణం చూసుకోవాలి. అర్థగ్రాహిత, చుట్టీపత్ర, కవి పరిచయం, ప్రతి క్రియ, సృజనాత్మకత అంశాలను తప్పనిసరిగా చదవాలి. తద్వారా హిందీలో మంచి మార్కులు సాధించవచ్చు.

– కె.విశ్వేశ్వరరావు, హిందీ టీచర్, మున్సిపల్ హైస్కూల్, మార్కాపురం

ఇంగ్లిష్‌లో మూడు విభాగాలపై శ్రద్ధ పెట్టాలి



ఇంగ్లిష్ పరీక్షలో మొత్తం మూడు విభాగాలుంటాయి. మూడు విభాగాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. రీడింగ్ కాంప్రహెన్షివ్, గ్రామర్, ఒకాబులరీ, డిస్క్రిప్షన్, కాన్వర్‌జేషన్, లెటర్ రైటింగ్ టాపిక్‌లను విద్యార్థులు తప్పనిసరిగా చూసుకోవాలి. ఛాయిస్ ఉన్నప్పటికీ అన్నీ రాయడం మంచిది. ఫార్మర్‌లెటర్, ఇన్‌ఫార్మర్ లెటర్ రాయడంలో జాగ్రత్త అవసరం. ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్, డయాగ్రంలు, 18 నుంచి 34వ ప్రశ్న వరకూ ఉండే గ్రామర్, ఒకాబులరీతోపాటు యాంటోనియమ్స్, సినోనియమ్స్, టెన్సెస్‌ను జాగ్రత్తగా రాయాలి.

– ఎ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ బాయ్స్ ఇంగ్లిష్ టీచర్, మార్కాపురం

నేచురల్ సైన్సుపై శ్రద్ధ పెట్టాలి



నేచురల్ సైన్సులో మానవ జీర్ణవ్యవస్థ, గుండె నిర్మాణం, రక్తప్రసరణ, మెదడు నిర్మాణం, అనువంశికం, స్వయం పోషకాలు, పరపోషకాలు, ఈక్వేషన్లు, పర్యావరణం, జీవ ప్రక్రియ, కిరణజన్య సంయోగక్రియ చాప్టర్లను కచ్చితంగా చదవాలి. ఈ టాపిక్స్ చూసుకుంటే మంచి స్కోర్ చేయవచ్చు. వ్యాసరూప ప్రశ్నలకు సమాధానంతోపాటు పటాలు వేయాలి. ప్రతి పాఠంలోని ప్రాథమిక భావనలు, నిర్వచనాలు చూడాలి. అన్ని ప్రశ్నలకు సమాధానాలు వరుస క్రమంలో రాయాలి. ప్రతి సమాధానంలో కీవర్డ్స్ ముఖ్యాంశాలను అండర్ లైన్ చేయాలి.

– సుధాకర్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, తర్లుపాడు

తెలుగుపై తొందరవద్దు



తెలుగు పరీక్షపై విద్యార్థులు తొందరపడొద్దు. ప్రశ్నాపత్రాన్ని బాగా చదవాలి. మొత్తం మూడు విభాగాలుంటాయి. అవగాహన, ప్రతి స్పందన చూసుకోవాలి. పద్యాలు, గద్యభాగం నుంచి 4 ప్రశ్నలు వస్తాయి. ఉపవాచకం, సంఘటన గురించి చదవాలి. అపరిచిత గద్యం నుంచి ప్రశ్నలు వస్తాయి. వ్యక్తీకరణ, సృజనాత్మకత టాపిక్‌లు కూడా చదవాలి. నానార్థాలు, పకృతి, వికృతి, సంధులు, వ్యాకరణాంశాలపై దృష్టి సారించాలి.

– ఎం.రవిచంద్ర కుమార్, జెడ్పీ గరల్స్ తెలుగు టీచర్, మార్కాపురం

సోషల్‌లో మంచి స్కోర్ చేయవచ్చు



జాగ్రఫీ, హిస్టరీ, సివిక్స్, ఎకనామిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రభుత్వం ఇచ్చిన బ్లూ ప్రింట్‌ను విద్యార్థులు చూసుకోవాలి. మ్యాప్ పాయింట్ తప్పనిసరిగా వస్తుంది. సమయపాలన అవసరం. ముఖ్యమైన తేదీలు చాలా జాగ్రత్తగా చదివి గుర్తుపెట్టుకోవాలి.

– వి.శుక్రునాయక్, సోషల్ టీచర్, జెడ్పీ బాయ్స్ మార్కాపురం

పిల్లల మానసిక అభివృద్ధికి కృషి చేయాలి



శిక్షణను పరిశీలిస్తున్న ఎంఈఓ శార్వాణి, కోర్సు డైరెక్టర్లు



కంభం : మాట్లాడుతున్న డీవైఈఓ శామ్యూల్



గొట్లగట్టులో మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహారావు

మార్కాపురం టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను మానసిక, శారీరకంగా అభివృద్ధి చేయాలని ఎంఈఓ శార్వాణి సూచించారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లలందరినీ ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఆట పాటలతో పిల్లలకు విద్యాభ్యాసం చేయాలని కోరారు. ఎంఈఓ–1 రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు తొలిసారిగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. త్వరలో అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలల్లో కలపబోతున్నారని తెలిపారు. సీడీపీవో సుశీలాదేవి మాట్లాడుతూ.. శిక్షణలో అంశాలను శ్రద్ధగా నేర్చుకోవాలని, కార్యాకర్తల మనోవికాసానికి మధ్యాహ్నం ఒంటి గంటకు యోగా కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలను గ్రూపులుగా విభజించి ఆటపాటలతో కూడిన కృత్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ వి.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు తొలి గురువులు అంగన్వాడీ కార్యకర్తలు

కంభం: చిన్నారులకు తొలి గురువులు అంగన్‌వాడీ టీచర్లని మార్కాపురం ఉపవిద్యాశాఖాధికారి శామ్యూల్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీలు విద్యాశాఖలో అంతర్భాగమని, పూర్వ ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల విజ్ఞాన స్వరూపాన్ని తీర్చిదిద్దే సామర్థ్యాలు అంగన్‌వాడీల సొంతమన్నారు. కార్యకర్తలు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. దశలవారీగా చిన్నారుల్లో నైపుణ్యాన్ని పెంచడం, బోధనలో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మాల్యాద్రి, శ్రీనివాసులు, ఎఫ్ఎల్ఎన్ జిల్లా కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలి

కొనకనమిట్ల: అంగన్‌వాడీ కేంద్రాలల్లో చిన్నారులకు అర్థమయ్యే విధంగా కార్యకర్తలు బోధించాలని ఎంఈఓ–2 బి.నరసింహారావు సూచించారు. మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అంగన్‌వాడీ కార్యర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు చిన్నారుల అభ్యసన సామర్థ్యాన్ని గమనించి మెరుగుపరిచేలా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పేందుకు కృషి చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ కె.సంజీవరావు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు తటాకం.. భక్తులకు సంకటం



రోడ్డుపైకి చేరిన మురుగు, సాగర్ నీరు

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని శ్రావణి ఎస్టేట్‌లోకి రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై మురుగు నిల్వ చేరింది. దీంతో వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాలినడకన వెళ్లే వారు మురుగును తొక్కుకుంటూ ఆలయానికి చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు చింది దుస్తులపై పడుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైడు కాలువల్లోని మురుగుకు తోడు, సాగర్ నీరు ఓవర్‌ఫ్లో, లీకేజీల వల్ల నీరు మొత్తం కాలువల ద్వారా రోడ్డుపైకి చేరుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సైడు కాలువలో ప్రవహిస్తున్న సాగర్ నీరు

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నా పూజలు



పూజలు నిర్వహిస్తున్న అన్నా రాంబాబు

తర్లుపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతోపాటు ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కర్‌రావు ఘన స్వాగతం పలికారు. అర్చకులు ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కె.రామకృష్ణారెడ్డి, కె.శ్రీకాంత్‌రెడ్డి, వి.మురళి, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, బాలయ్య, గాలిరెడ్డి, పి.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

పొదిలి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్న సంతర్పణ చేశారు. నిమ్మవరం గ్రామానికి చెందిన కొమ్మినేని చిన్న తిరుపాలు, రమణమ్మ, బ్రహ్మయ్య, కోటేశ్వరమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయ పూజారి మురళీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పొనుగుపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



మార్కాపురంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి తదితరులు

పొదిలి: నమ్మిన ధర్మాన్ని అమలు చేస్తూనే, ఇతర మతాలపై లౌకిక తత్వాన్ని చాటిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి కొనియాడారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దోర్నాల రమణారెడ్డి, యుద్ధం మహేష్, కంతం నాగరాజారావు, ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు ఛత్రపతి శివాజీ

మార్కాపురం: ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం పట్టణంలోని శివాజీనగర్ 2వ లైనులో ఘనంగా నిర్వహించారు. మార్కాపురం బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, సతీష్ మాట్లాడుతూ.. హిందూ ధర్మం కోసం పోరాడిన మహనీయుడు శివాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణారావు, చెన్నయ్య, చంద్రశేఖర్, గురుమూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి



బేస్తవారిపేట : మొక్కజొన్న రైతులకు సూచనలిస్తున్న ఏఓ జక్కం మెర్సీ



మార్కాపురం : మొక్కజొన్న రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీనివాసులు

బేస్తవారిపేట: ప్రతి రైతు తప్పనిసరిగా ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించుకోవడం ద్వారా యూనిక్ ఐడీ పొందాలని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ సూచించారు. బుధవారం మండలంలోని చెన్నుపల్లె, బాలేశ్వరపురంలో రైతులకు యూనిక్ ఐడీ నమోదుపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో యూనిక్ ఐడీ ఉన్న రైతులకే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు అందుతాయన్నారు. ఉద్యానవనశాఖ అధికారిణి డి.శ్వేత మాట్లాడుతూ.. ఉద్యాన యాంత్రీకరణ పథకం సబ్సిడీల గురించి వివరించారు. అనంతరం మొక్కజొన్న రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏలు పఠాన్, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఆయన పెద్ద నాగులవరం, నికరంపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది నవ్య, గణేష్, రైతులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ఖాతాదారులకు విశిష్ట సేవలు



కెనరా బ్యాంక్ వారోత్సవాల్లో మాట్లాడుతున్న మీరావళి

కొనకనమిట్ల: కెనరా బ్యాంక్ శాఖ ద్వారా కస్టమర్లకు విశిష్ట సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తిరుపతి కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయ అధికారి మీరావళి పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ డిపాజిట్ వారోత్సవాల సందర్భంగా గొట్లగట్టు శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖాతాదారులకు బ్యాంక్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలతోపాటు డిపాజిట్, వడ్డీ తదితర విషయాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. కస్టమర్ల సేవింగ్ ఖాతాలో ఉన్న యావరేజ్ డిపాజిట్ అమౌంట్‌ను బట్టి ఉచిత క్యాన్సర్ కేర్ ట్రీట్‌మెంట్ రూ.10 లక్షల వరకు ప్రీమియం చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు రీజినల్ అధికారి కె.ప్రసాద్, గొట్లగట్టు కెనరా బ్యాంక్ మేనేజర్ బి.రమేష్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనునాయక్, మాజీ ఉప సర్పంచ్ పొదిలి తిరుపతయ్య, సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.